క్లుప్తంగా

సాక్షి గణపతికి విశేషపూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై సోమవారం సాయంత్రం సాక్షిగణపతికి అభిషేకం, విశేషపూజలు నిర్వహించారు. సాక్షి గణపతికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు.

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం


దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం విశాఖపట్నానికి చెందిన సూర్యదేవర సాంబశివరావు రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు పి.దేవికకి అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

ప్రసాదాల తయారీపై పర్యవేక్షణ తప్పనిసరి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మల్లన్న ప్రసాదాల తయారీపై నిరంతరం పర్యవేక్షించాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. సోమవారం దేవస్థాన పరిపాలన భవనంలోని సమీక్షా సమావేశ మందిరంలో అన్ని శాఖాధిపతులు, విభాగాల పర్యవేక్షకులతో సమీక్షా సమావేశమై పలు సూచనలు చేశారు. సమావేశంలో డిప్యూటీ ఈఓ ఎం.రమణమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మురళీబాలకృష్ణ, నరశింహారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు ఇవ్వాలి

పాములపాడు: రాజకీయాలతో ప్రమేయం లేకుండా అర్హత ఉన్న నిరుద్యోగ యువతకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న, నాయీ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు వెంకటరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సేవాభారతి(వైఆర్‌డీఎస్) కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌లకు ప్రభుత్వం నిధులు భారీగా విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు సాయికృష్ణ, వాల్మీకి సంఘం నాయకులు స్వాములు, తిరుపతయ్య, మైనార్టీ సంఘం నాయకులు షేక్షావలి, సయ్యద్‌బాషా ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీఓబులేష్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును కలిసి వినతి పత్రం అందించారు. మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చూడాలని, రిటైర్డ్ అయిన, మరణించినవారి స్థానాలను భర్తీ చేయాలని కోరారు.

పంచమఠాలలో పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్ష మఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రమైన భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్ర దీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.

మోసకారి..చంద్రబాబు

● మాజీ ఎంఎల్‌ఏ శిల్పా చక్రపాణిరెడ్డి


'క్యూఆర్ కోడ్' పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా, మండల నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఎన్నికల సమయంలో సూపర్ 6 పథకాలంటూ ఓట్లు వేయించుకుని అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలను చంద్రబాబు నాయుడు మోసం చేశారని మాజీ ఎంఎల్‌ఏ శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. సోమవారం సున్నిపెంటలో కృష్ణవేణి కళ్యాణ మండపంలో పార్టీ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సూపర్ 6 పథకాలతో ఒక్కో కుటుంబానికి 5 ఏళ్లలో ఎంత లబ్ధి చేకూరుస్తామో తెలుపుతూ కూటమి నేతలు బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ పేరుతో బాండ్లను జారీ చేశారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా ఏ ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేశారన్నారు. అందుకే బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ పేరుతో ప్రజల్లోకి వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పథకాలను ఎలా నీరుగార్చుతున్నారో ప్రజలకు వివరించాలన్నారు. తల్లికి వందనం నగదు కొందరికే జమ అయిన విషయాన్ని ప్రజలతో కలిసి తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులను నిలదీయాలన్నారు. అనంతరం కూటమి నేతల మోసాలపై రూపొందించిన 'క్యూఆర్ కోడ్' పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, గంగుమాల శోభన్‌బాబు, మహిళా నాయకురాలు జిల్లేల లక్ష్మీదేవి,మండల అధ్యక్షుడు వట్టి వెంకటరెడ్డి, ప్రధా నకార్యదర్శి లోకేష్‌చౌదరి, మైనారిటీ నాయకులు మహమ్మద్ ఖాశీం,ఎంఏ రజాక్, గౌస్‌మొహిద్దీన్, ఎస్టీ సెల్ నాయకులు కుడుముల మూగెన్న, ఎస్సీ సెల్ నాయకులు రవి, యువజన విభాగం నాయకులు వెంకట్, సీతారాం నాయక్, సీహెచ్ పుల్లయ్య, ఏసు, దమయంతి,కోటమ్మ, బడే తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

దెబ్బకు దెబ్బ

శ్రీశైలంలో వైస్సార్‌సీపీ కార్యకర్తలపై ఎమ్మెల్యే బుడ్డా అనుచరులు కక్ష పూరితంగా వ్యవహరిస్తూ హింసిస్తున్నారు. కార్యకర్తల ఆదాయ వనరులకు గండి కొడుతున్నారు. త్వరలో దెబ్బకు దెబ్బ కొట్టి కూటమినేతలను ఎండగడతాం.

– రవి,వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు

శిల్పన్న ఆదేశిస్తే దేనికైనా సిద్ధం

శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశిస్తే బుడ్డా బ్యాచ్ అరాచకాలకు అడ్డుకట్ట వేస్తాం. కార్యకర్తల క్షేమం కోసం ఎంతకైనా పోరాడతాం. ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని బుడ్డా నీచ రాజకీయాలు చేస్తున్నారు. ఆయ న నీచ రాజకీయాలకు ఇక్కడ ఎవరూ భయపడరు.

– జి.శోభన్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్యకర్తలపై రౌడీషీట్లా?

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ రౌడీషీట్లు తెరిపించేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నాడు. ఆయన అరాచక దమనకాండను అణచివేస్తాం. కార్యకర్తలపై కక్ష సాధింపులు మానుకోకపోతే భయానికి భయమంటే ఏంటో పరిచయం చేస్తాం.

– వట్టి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ, మండల అధ్యక్షులు

అభివృద్ధి చేసి తర్వాత విమర్శించు

నియోజకవర్గంలో అభివృద్ధి చేసి ఆపై శిల్పన్నను విమర్శించు. ఉన్నత చదువులు చదివి దిగజారి మాట్లాడటం తగదు – వెంకట్, వైఎస్సార్‌సీపీ, యువజన విభాగం, మండల నాయకులు

19న వెలుగోడుకు రెజాంగ్ లా కలశ యాత్ర


కరపత్రాలు విడుదల చేస్తున్న యాదవ సంఘం నాయకులు

వెలుగోడు: భారత సైన్యంలో అహిర్(యాదవ) రెజిమెంట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన రెజాంగ్ లా కలశ యాత్ర ఈనెల 19న వెలుగోడుకు చేరుకుంటుందని అఖిల భారత యాదవ మహాసభ రాయలసీమ కన్వీనర్ శేషఫణి యాదవ్, రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు యాదవ్ తెలిపారు. రెజాంగ్ లా కలశ యాత్ర పోస్టర్‌ను సోమవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. 1962లో రెజాంగ్ లా ప్రాంతం వద్ద జరిగిన భారత్-చైనా యుద్ధంలో భారతదేశం తరపున 114 మంది యాదవ సైనికులు 5 వేల మంది చైనా సైనికులతో తలపడి 1,310 మందిని హతమార్చారన్నారు. యాదవ సైనికుల ధైర్యసాహసాలకు గుర్తుగా అప్పట్లో ఏర్పాటు చేసిన అహిర్(యాదవ)రెజిమెంట్‌ను తదనంతర కాలంలో కేంద్రం రద్దు చేసిందన్నారు. రద్దు చేసిన అహిర్ రెజిమెంట్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రెజిమెంట్ పునరుద్ధరిస్తే యాదవ యువత సైన్యంలో చేరి దేశ భద్రతకు పాటుపడతారన్నారు. యాదవలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రెజాంగ్ లా కలశ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ నియోజకవర్గ కన్వీనర్ మన్నెం బాలస్వామి యాదవ్, జిల్లా నాయకులు రమేష్, మండల నాయకులు నాగేశ్వ్వరరావు యాదవ్, చెన్నారాయుడు యాదవ్, శివశంకర్ యాదవ్, రామసుబ్బయ్య యాదవ్, గురుస్వామి యాదవ్, ఎల్లయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి


నిరసనల తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

నందికొట్కూరు: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఆది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం గవర్నమెంట్ జూనియర్ కళాశాల నుంచి పటేల్ సెంటర్ వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో నారా లోకేష్ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.13 వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేయడం తగదన్నారు. మెడికల్ విద్యను ప్రైవేట్ పరం చేసేందుకు తెచ్చిన జీఓలను వెనక్కి తీసుకోవాలని కోరారు. పీజీ విద్యార్థులను విద్యకు దూరం చేసే జీవో 77ను రద్దు చేయాలన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం సంఘం నాయకులు బహబూబ్, జగదీష్, శ్యాంనాయక్, అజయ్, జగన్, శివ, జస్వంత్, సూరి జగన్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


వెలుగోడులోని ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

వెలుగోడు: పట్టణంలోని శ్రీసాయి శ్రీనివాస, దుర్గాభవాని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో సోమవారం సీ అండ్ డీఏ (గుంటూరు) విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమతి పత్రాలను చూపకపోవటంతో రూ.13 లక్షల విలువ చేసే ఎరువులు, పురుగు మందుల విక్రయాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో ఏడీఏ కేఎంఈ ప్రసాద్, కే.శ్రీనివాసులు, ఆత్మకూరు ఏడీఏ శశికళ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలోని సుమంత్ ట్రేడర్స్ పురుగు మందుల దుకాణాన్ని ప్రత్యేక బృందం తిరుపతి ప్రసాద్, విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, ఆత్మకూరు ఏడీఏ శశికళ సోమవారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

ఆత్మకూరు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని మున్సిపల్ వర్కర్స్ అండ్‌ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రణధీర్ హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం నిరాహారదీక్షలు చేస్తున్నా స్పందించకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ప్రసాద్, తిమ్మయ్య, చిన్ననాగరాజు, సువర్ణమ్మ, సుశీలమ్మ, సుగుణమ్మ, జీవరత్నమ్మ, వీరన్న పాల్గొన్నారు.

పథకాలు ఉపయోగించుకోవాలి

పగిద్యాల: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. సోమవారం స్థానిక సహకార వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమయ్యే రసాయనిక ఎరువులు తక్కువ ధరకే సొసైటీలో లభ్యమవుతాయన్నారు. అనంతరం సొసైటీ నూతన చైర్మన్ దామోదర్‌రెడ్డి, డైరెక్టర్లు పల్లె గంగన్న, కొట్టం శంకర్‌ల చేత సొసైటీ సీఈఓ ఖాజా మొద్దీన్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి పాల్గొన్నారు.

నూతన ట్యాంకు నిర్మించాలి

జూపాడుబంగ్లా: నివాసగృహాల మధ్యన ఉన్న శిథిలమైన ఓవర్‌హెడ్ ట్యాంకును తొలగించి నూతన ట్యాంకును నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కమ్ముపేటలో శిథిలమైన ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు శిథిలం కావటంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్ణ, రాము, శ్రీనివాసులు, శివ, దేవరాజు, కాలనీవాసులు సాధిక్‌బాషా, వెంకటేష్‌గౌడు, అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో మాజీ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి


మాజీ ఎన్నికల ప్రధాన అధికారికి స్వాగతం పలుకుతున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను మాజీ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ అగర్వాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన ఆయనకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

దాణా పంపిణీ

పాములపాడు: స్థానిక పశువైద్యశాల వద్ద సోమవారం 37 మంది పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశుదాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి భాస్కర్, వెటర్నరీ అసిస్టెంట్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలి


మాట్లాడుతున్న నాగిరెడ్డి

పగిద్యాల: నాగటూరు ఎత్తిపోతల పథకం ఫేజ్ 1, ఫేజ్ 2 నుంచి నీటి సరఫరా చేసి మెట్టప్రాంత రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నాగటూరు ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, విద్యుత్ వైర్లు చోరీకి గురైనా పట్టించుకునే నాథుడు లేరని విమర్శించారు. గతంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించగా మోటార్లను రిపేరీ చేయించి కృష్ణా బ్యాక్‌వాటర్‌ను పంటలకు పారించుకుని పంటలను కాపాడుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి నాగటూరు ఎత్తిపోతల పథకం నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. సమావేశంలో రైతులు భాస్కర్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి, రామేశ్వరరెడ్డి, గణపురం రెడ్డి, గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

మహానందిలో కొనసాగిన భక్తుల సందడి

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో భక్తుల సందడి కొనసాగింది. సోమవారం పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడండి

వెలుగోడు: కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని ఎస్డీపీఐ శ్రీశైలం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి గౌస్‌మొద్దీన్ సోమవారం సర్పంచ్ వేల్పుల జయపాల్‌కు వినతిపత్రం అందజేశారు.

హెచ్‌ఎంలకు శిక్షణ

బండిఆత్మకూరు: మండలంలోని పార్నపల్లి ప్రభాత్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. సమగ్ర శిక్షా ఏపీసీ ప్రేమంత్ కుమార్ శిక్షణను తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి మాధవీలత, ఎంఈఓలు యశోద, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అభివృద్ధిబాటలో నడవాలి

జూపాడుబంగ్లా: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ అభివృద్ధిబాటలో నడవాలని ఏపీఎం అంబమ్మ సూచించారు. సోమవారం రైతు ఉత్పత్తిదారుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె రైతులకు పలు సూచనలిచ్చారు. అనంతరం 14 రైతుమిత్ర గ్రూపులకు రూ.19 లక్షల రుణాలను అందజేశారు.

అందుబాటులో యూరియా

మహానంది: యూరియా అందుబాటులో ఉందని ఏఓ నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం తిమ్మాపురం సొసైటీ కార్యాలయంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన మేరకు యూరియా అందిస్తున్నామన్నారు.

పంటల బీమాకు నేడు చివరితేదీ

జూపాడుబంగ్లా: పత్తి, వేరుశనగ పంటలకు బీమా చేయించుకునేందుకు మంగళవారం చివరితేదీ అని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. మొక్కజొన్న, కందులు, పండుమిరప, జొన్నలు, ఆముదాలు, కొర్రలు, సజ్జలు, ఉల్లి పంటలకు మాత్రం ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు.

యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జూపాడుబంగ్లా: వ్యవసాయంలో యంత్రాలను సద్వినియోగం చేసుకుని పెట్టుబడులు తగ్గించుకోవాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. తూడిచెర్ల గ్రామానికి చెందిన శంకరమల్లేశ్వరస్వామి రైతుమిత్ర గ్రూపు సభ్యులకు రాయితీపై మంజూరైన డ్రోన్‌ను సోమవారం ఆయన పంపిణీ చేశారు.

అలరించిన భక్తి రంజని

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన మురళీమోహనశర్మ వారి భక్తిరంజని కార్యక్రమం అలరించింది. శరణు సిద్ధి వినాయక, లింగాష్టకం, బిల్వాష్టకం, శివతాండవ స్తోత్రం, కాలభైరవాష్టకం, పలు శివకీర్తనలను పూజ శర్వాణి, నిఖిల, సహస్ర, అనిరుధ్, తన్మయిశ్రీ తదితరులు ఆలపించారు.

వైద్యశాల తనిఖీ



బండి ఆత్మకూరు: మండలంలోని సింగవరం పశు వైద్యశాలను సోమవారం ఏడీ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. లంపీ స్కిన్ వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి, రికార్డు లను, ఔషధ నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లంపీ స్కిన్ వ్యాధి ప్రబలకుండా ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేయాలని అధికారులకు సూచించామన్నారు. రైతులు తప్పకుండా తమ పశువులకు టీకాలు వేయించాలన్నారు.

తభక్తిశ్రద్ధలతో పల్లకి సేవ

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఆలయ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డిల ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

ఖరీఫ్ సాగు కష్టమేనా?

● ముఖంచాటేసిన వరుణుడు
● వాడుముఖం పడుతున్న పంటలు


వాడుపడుతున్న మొక్కజొన్న పంట

ఆత్మకూరు: ఖరీఫ్ రైతన్నలకు కష్టంగా మారింది. ముందస్తు వర్షాలతో మురిపించిన వరుణుడు ఆ తర్వాత ముఖం చాటేశాడు. విత్తు వేసిన పైర్లు వాడుముఖం పడుతుండగా.. విత్తనం వేయాల్సిన రైతులు అదును దాటుతుందని ఆందోళన చెందుతున్నారు. ఆత్మకూరు డివిజన్‌లో ఏప్రిల్ నెలలో వర్షాకాలాన్ని తలపించే రీతిలో రికార్డుస్థాయిలో వర్షాలు కురిశాయి. దీంతో రైతులు 40 శాతం పంటలు సాగు చేశారు. ఇంకా 60 శాతానికి పైగా పొలాల్లో విత్తు వేయాల్సి ఉంది. ఆత్మకూరు డివిజన్‌లో 7,300 హెక్టార్లకు గానూ కేవలం 1,200 హెక్టార్లలో మాత్రమే పంటలను సాగుచేయగా, వెలుగోడు మండలంలో 3,500 హెక్టార్లకు కేవలం 250 హెక్టార్లు మాత్రమే పంటలు సాగయ్యాయి. పాములపాడు మండలంలో 2 వేల హెక్టార్లకు పైగా వివిధ వాణిజ్య పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 400 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలను సాగుచేశారు. కొత్తపల్లి మండలంలో దాదాపు 5 వేల హెక్టార్లలో పంటలను సాగుచేయాలి ఉండగా 1,200 హెక్టార్లలో మాత్రమే సాగైంది. ఆ తర్వాత వర్షాలు లేకపోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయి. మరో 60 శాతానికి పైగా పొలాల్లో రైతులు విత్తనాలు వేయాల్సి ఉంది.

పెరిగిన పెట్టుబడులు

విత్తనాలు, ఎరువులు ధరలు పెరగడంతో పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్నదాతలు విధిలేని స్థితిలో పంటలను సాగు చేస్తున్నారు. మొక్కజొన్న ప్యాకెట్ (4 కిలోలు) రూ.1,200 నుంచి రూ.1,800 ఉండగా, ఈ యేడాది రూ.1,800 నుంచి రూ.2 వేల దాకా విక్రయిస్తున్నారు. ఇక యూరియా కొరత చెప్పాల్సిన అవసరమే లేదు. ప్రస్తుతం యూరియా నిబంధనల ప్రకారం బస్తా రూ.266కు అమ్మకాలు జరగాల్సి ఉండగా.. బ్లాక్ మార్కెట్‌లో రూ.400కు పైగా విక్రయిస్తున్నా వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రైతన్నలకు పెట్టుబడులు ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల దాకా ఖర్చవుతోంది.

వెంటాడుతున్న కరువు ఛాయలు

మేఘాలు గంభీరంగా కనిపిస్తున్నా వర్షం మాత్రం కురవడం లేదు. అసలు వరుణుడు కరుణిస్తాడో లేదో కూడా తెలియని పరిస్థితి. కరువుఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పత్తి, మొక్కజొన్న పంటలకు భారీ వర్షాలు కావాలి. వర్షాలు లేకపోవడంతో ఇప్పటికే పైర్లు వాడుపట్టాయి. ఇక మెట్ట వరి రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. వరి పంట ఏపుగా పెరగకపోగా నాలుగు, ఐదు పిలకలకే పరిమితమయ్యింది.

వర్షాలు వస్తాయని విత్తనం వేశాం



ఈ యేడాది ముందస్తు వర్షాలు కురవడంతో తరచూ కురుస్తాయనుకుని మొక్కజొన్న, పత్తి విత్తరం వేశాం. అప్పటి నుంచి వానదేవుడు ముఖం చాటేశాడు. మరో వారం రోజుల్లో వర్షాలు రాకపోతే పంటలు చేతికందే పరిస్థితి లేదు. పూర్తిగా ఎండిపోతాయి. వాటిని తొలగించి మరో పంట వేయాలి.

– బాషా, రైతు, శివపురం గ్రామం

పైర్లు ఎండిపోతున్నాయి



విత్తనం వేసినప్పటి నుంచి వర్షం పడలేదు. పైర్లు ఎండిపోతున్నాయి. బోర్ల వద్ద ఉన్న పైర్లనైనా బతికించుకుందామంటే కరెంట్ కోతలు ఉన్నాయి. బోరుబావుల నుంచి పైర్లను తడిపేందుకు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. వర్షాలు రాకపోతే అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

– వెంకటేశ్వర్లు, రైతు, ఆత్మకూరు

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలి

నందికొట్కూరు: సివిల్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయవాదులు విజయలక్ష్మి, వెంకటరమణ, యుగంధర్‌రావు సూచించారు. సోమవారం కోర్టు ఆవరణలో బ్యాంక్, ఇన్సూరెన్స్ అధికారులకు మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంక్ సివిల్ కేసులలో ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం పొందవచ్చన్నారు. సదస్సులో పారా లీగల్ వలంటీర్లు శోభారాణి, హుసేన్, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా పరిష్కార వేదిక

జూపాడుబంగ్లా: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపికృష్ణ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు బసీర్, నాగేంద్ర, జ్యోతి, ఎంఈఓ-1 చిన్నమద్దిలేటి, ఏపీఓ రేష్మ, సెరికల్చర్ టీఏ కాశీవిశ్వనాథం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుమారి మాత్రమే హాజరయ్యారు. మిగతా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. గ్రామాల్లో వీధిదీపాలు వెలిగించాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు అధికారులకు వినతిపత్రం అందజేశారు. భూసమస్యను పరిష్కరించాలని తంగడంచ గ్రామానికి చెందిన రైతు సురేష్ ఫిర్యాదు చేశారు.

పీజీఆర్‌ఎస్‌కు ఏడు వినతులు

కొత్తపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడుగురు ఫిర్యాదులు అందజేశారని తహసీల్దార్ ఉమారాణి తెలిపారు. విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.